

35వ డివిజన్‌లో వాకర్స్‌ను ఓటు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి



కొత్తపల్లి: పట్టణంలో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు, కౌన్సిలర్లు

# జోరుగా గులాబీ శ్రేణుల ప్రచారం



15వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు వొడ్నాల రాజు

- **బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి**

కార్పొరేషన్, నవంబర్ 20: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఎన్నికల ప్రచారం హోరందుకుంది. నగరంలోని అన్ని డివిజన్లలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం విస్తృతంగా చేపడుతున్నారు. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, ఇన్‌చార్జులు ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వెయ్యాలని కోరుతున్నారు. నగరంలోని 35వ డివిజన్‌లో కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి సోమవారం మార్నింగ్ వాకింగ్ వాకర్స్‌ను కలిసి ప్రచారం చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించి ఓటు అభ్యర్థించారు. అలాగే, 15, 18, 27, 24, 22, 55వ డివిజన్లలో ఆయా డివిజన్ల నాయకులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నగరంలో గత 50 ఏళ్లలో జరుగని అభివృద్ధి కేవలం ఈ పదేళ్లలోనే జరిగిందన్నారు. అన్ని డివిజన్లలో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు రోజూ మంచినీటి సరఫరా అందిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో 24 గంటలు మంచినీటి సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ అభివృద్ధి మరింతగా కొనసాగాలంటే గంగుల కమలాకర్‌ను నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాన్ని అందిస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ మాత్రమేనని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మవద్దని, బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వొడ్నాల రాజు, బాకారపు ప్రశాంత్, హరీశ్, శ్రావణ్, దానబోయిన రాము, రాజేందర్, సురేశ్, శివాజీ, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి, నవంబర్ 20: పట్టణంలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కౌన్సిలర్లు ఒకటి, 12వ వార్డుల్లో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి మంత్రి గంగుల కమలాకర్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. వారి వెంట కౌన్సిలర్లు వాసాల రమేశ్, వేముల కవిత-శేఖర్, రుద్ర రాద తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని నాగులమల్యాల గ్రామంలో ఏఎంసీ చైర్మన్ రెడ్డవేని మధు యువకులతో కలిసి ప్రచారం చేశారు. మంత్రి గంగుల కమలాకర్ గెలుపుతోనే కరీంనగర్ అభివృద్ధి ఆధారపడి ఉందని, ఓటర్లు కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

## విద్యుత్ ఉద్యోగులకు శిక్షణ

ముకరంపుర, నవంబర్ 20: ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల సర్కిళ్లలోని జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఆర్టిజన్లకు నిర్వహించిన శిక్షణ తరగతులను ఎస్ఈ వీ గంగాధర్ ప్రారంభించారు. పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యూటీ చేసే విధానం, అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ బుక్కులు రాసే విధానం, ఇంక్రిమెంట్లు, సెలవుల మంజూరు, క్రమశిక్షణ చర్యల నమోదు, ఆన్‌లైన్ అకౌంట్స్, ఆఫీసు పనులను పూర్తి చేయడంపై వరంగల్ కార్యాలయ జీఎంలు వేణుబాబు, గిరిధర్ శిక్షణ ఇచ్చారు. డీఈలు విజయేందర్ రెడ్డి, రాజం, తిరుపతి, లక్ష్మీరెడ్డి ,చంద్రమౌళి, ఏడీఈలు అంజయ్య, రఘు, నరేందర్, రాజు, సత్యనారాయణ, కిరణ్, లావణ్య, స్వప్న, శ్రీనివాస్, ఎస్ఏవో రాజేశం, ఏవోలు అరవింద్, రాజేంద్రప్రసాద్, ఏఏవోలు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో కార్తీక సోమవారం పూజలు



శివాలయంలో పూజలు చేస్తున్న మేయర్ సునీల్ రావు దంపతులు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 20: జిల్లా కేంద్రంలోని ఆలయాల్లో కార్తీక మాసం సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ ఆవరణలోని తులసీ చెట్లు, రావి చెట్ల వద్ద దీపాలు వెలిగించారు. ఈ క్రమంలో పాత బజార్ గౌరీ శంకరాలయం, కమాన్ రోడ్డు రామేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడాయి. పాతబజార్ శివాలయంలో మేయర్ వై సునీల్ రావు కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు.

## కిట్టీ పార్టీ సభ్యుల వనభోజనాలు



వనభోజనాలు చేస్తున్న కిట్టీ పార్టీ సభ్యులు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 20 : జిల్లా కేంద్రంలోని మగువ కిట్టీ పార్టీ సభ్యులు కార్తీక సోమవారం సందర్భంగా వనభోజనాలకు వెళ్లారు. నగర శివారులోని ఓ ఉసిరి చెట్టుకు పూజలు చేసి, అక్కడే వన భోజనాలు చేశారు. ఇక్కడ సభ్యులు చకిలం స్వప్న, శ్వేత, రాధ, ఝాన్సీ, శాలినీ, సాహితీ, కృష్ణవేణి, ప్రవల్లిక, సంధ్య, లావణ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

కలెక్టరేట్, నవంబర్ 20: బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా సంక్షేమాధికారి సరస్వతి పేర్కొన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచనతో మహిళా శిశు సంక్షేమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్న బాలల హక్కుల అవగాహన శిబిరాల్లో భాగంగా, సోమవారం బాలసదనంలో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, జీవించడం, అభివృద్ధి చెందడం, రక్షణ పొందడం, భాగస్వామ్యపు హక్కులపై పిల్లలకు అవగాహన కల్పించారు. పిల్లలంతా రాజ్యాంగం కల్పించిన హక్కులు సద్వినియోగం చేసుకుని, ఉన్నత చదువులు చదివి, అత్యున్నత స్థానానికి ఎదగాలని ఉద్బోధించారు. ఎవరికైనా ఆపద వస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీపీవో శాంత, బాలసదనం సూపరింటెండెంట్ సంతోషి, బాల హక్కుల రక్షణ విభాగం ప్రతినిధులు, కో-ఆర్డినేటర్ సంపత్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న చిన్నారులు

## నెట్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

కొత్తపల్లి, నవంబర్ 20: హర్యాన రాష్ట్రం హిస్సార్‌లో జరిగే జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ట్రినిటి జూనియర్ కళాశాల విద్యార్థిని ఎం హర్షిత ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పేర్కొన్నారు. ఇటీవల సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న హర్షిత అత్యంత ప్రతిభ కనబరచడంతో జాతీయ పోటీలకు ఎంపికైందన్నారు. సోమవారం విద్యార్థినిని ట్రినిటి కళాశాలల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎం రమణారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

### *అంతర్ విశ్వవిద్యాలయ కబడ్డీ పోటీలకు ఎంపిక*

తమిళనాడు రాష్ట్రం అలగప్పాలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థిని వాసవి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. ఇటీవల శాతవాహన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన పోటీల్లో వాసవి ప్రతిభ చూపి అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపికైందన్నారు. వాసవిని కరస్పాండెంట్ వీ ఆగంరావు, ప్రిన్సిపాల్ నివాస్, తదితరులు అభినందించారు.

## 'బీజేపీని ఓడించాలి'

తెలంగాణచౌక్, నవంబర్ 20: కార్పొరేట్ కనుసన్నల్లో పాలన కొనసాగిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. నగరంలోని కోతిరాంపూర్‌లో గల పార్టీ జిల్లా కార్యాలయం (ముకుందలాల్ మిశ్రా భవనం)లో సోమవారం పార్టీ నగర కార్యదర్శి గుడికందుల సత్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాలు దేశ సంపదను తమ అనుకూల కార్పొరేట్ సంస్థలు అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. జిల్లా కార్యదర్శి గీట్ల ముకుందరెడ్డి, వర్ణ వెంకటరెడ్డి, బీమాసాహెబ్, నాగరాణి, రాజు, సంపత్ పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ అభ్యర్థులనే గెలిపించాలి




మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి

- **విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కేసీఆర్‌తోనే సాధ్యం**
- **మాజీ ఎమ్మెల్సీ భట్టాపురం మోహన్‌రెడ్డి**

కలెక్టరేట్, నవంబర్ 20: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులనే గెలిపించి, రాష్ట్రంలో మరోసారి ఆ పార్టీకి అధికారం అందించాలని మాజీ ఎమ్మెల్సీ భట్టాపురం మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని పెన్షనర్స్ భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వరాష్ట్రంలోనే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. ఉమ్మడి పాలనలో ఉద్యోగుల సమస్యలు అటకెక్కించిన పాలకులు, వారికి ఎలాంటి లబ్ధి చేకూర్చలేదని మండిపడ్డారు. తొమ్మిదేళ్లలో అనేక రకాల ప్రయోజనాలు పెన్షనర్లకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం వర్తింపజేసిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ భూములను సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. రాష్ట్రంలో వస్తున్న ధాన్యం దిగుబడితో పంజాబ్, హర్యానా రాష్ట్రాలను వెనక్కునెట్టిందన్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితుడనై బీఆర్‌ఎస్‌లో చేరినట్లు స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో పెన్షనర్ల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. విశ్రాంత ఉద్యోగుల హెల్త్‌కార్డులు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసేలా నగదు రహిత వైద్య సేవలందించేలా ముఖ్యమంత్రిని ఒప్పించనున్నట్లు ప్రకటించారు. రెండో పీఆర్సీని నిర్ణీత గడువులో మంచి ఫిట్‌మెంట్ ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోసం అంజయ్య, ప్రధాన కార్యదర్శి దామెర మహేంద్రరెడ్డి, కోశాధికారి బూరుగుపల్లి నరేందర్, అసోసియేట్ అధ్యక్షుడు రాచ ఆనంద్, ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరేందర్‌రెడ్డి, కార్యదర్శి రామచంద్రారావు, తదితరులు పాల్గొన్నారు.